

# స్టోర్ రూమ్‌లో.. బల్లపై నిద్ర!


## ఇన్ఫోసిస్ తొలినాళ్లలో అవమానాలు ఎదుర్కొన్న నారాయణమూర్తి

న్యూఢిల్లీ, జనవరి 7: ఐటీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ఓసారి అమెరికాలో క్లయింట్ ఇచ్చిన చిన్న స్టోర్ రూమ్‌లో.. చుట్టూ అట్ట పెట్టెలతో కంగాళీగా ఉండి, కిటికీ కూడా లేని గదిలో చెక్కబల్లపై నిద్రపోయిన విషయం మీకు తెలుసా? ఇండియన్ అమెరికన్ రచయిత్రి చిత్రా బెనర్జీ దివాక రునీ రాసిన నారాయణమూర్తి జీవిత కథ 'యాన్ అన్ కామన్ లవ్: ద ఎర్లీ లైఫ్ ఆఫ్ సుధా అండ్ నారాయణమూర్తి' పుస్తకంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇన్ఫోసిస్ స్థాపించిన తొలినాళ్లలో ఎదురైన ఇలాంటి అవమానాల నుంచి వివాహం వరకు పలు విషయాలను ఇందులో చర్చించారు. ఇన్ఫోసిస్ స్థాపించిన మొదట్లో న్యూయార్క్‌కు చెందిన డాన్ లిలెస్ కంపెనీ డాటా బేసిక్స్ కార్పొరే

### కష్టాలకు వెరువకుండా ముందుకు..

### జీవిత కథలో ఆసక్తికర అంశాలు

షన్ ఇన్ఫోసిస్‌కు క్లయింట్‌గా ఉండేది. డాన్ తరచూ చెల్లించాల్సిన సొమ్మును ఆలస్యం చేస్తూ నారాయణ మూర్తిని ఇబ్బందులకు గురిచేసేవాడు. మూర్తి ఆయన ఇన్ఫోసిస్ సహచరులు మాన్‌హటన్ వెళ్లిన ప్రతిసారి డాన్ వారిని ఇబ్బందులు పెట్టేవాడు. హోటల్ రూమ్స్ బుక్ చేసేవాడు కాదు. ఒకసారి మూర్తి డాన్ వద్దకు వెళ్లినప్పుడు నారాయణమూర్తి చేదు అనుభవం ఎదుర్కొన్నారు. డాన్ ఇంట్లో నాలుగు బెడ్రూములు ఉంటే మూర్తికి మాత్రం తన ఇంటిలో కిటికీ కూడా లేని స్టోర్ రూమ్ ఇచ్చాడు. అది మొత్తం చెత్తకుప్పలా ఉంది. అయినా సరే అందులోనే ఓ పెద్దబాక్సుపై ఆయన నిద్రపోయి నట్టు చిత్రా బెనర్జీ ఆ పుస్తకంలో రాసుకొచ్చారు. అయినప్పటికీ మూర్తి డాన్‌కు అత్యవసర సమయం లోనూ ఆయన డిమాండ్లు నెరవేర్చి పెట్టారని అందులో పేర్కొన్నారు. ''మా అమ్మ అతిథులను దైవంలా భావించేది. మా నాన్న ముందస్తు సమా చారం లేకుండా అతిథులను తీసుకొచ్చినప్పుడు కూడా ఏమాత్రం విసుక్కోకుండా వారికి సేవలు చేసేది. ఆమె ఆహారాన్ని కూడా వారికి పెట్టి తాను తినకుండానే నిద్రపోయేది. కానీ ఇక్కడ డాన్ మాత్రం ఖరీదైన, విలాసవంతమైన బెడ్‌పై పడుకుని తనను మాత్రం ఆ రాత్రి చిన్న బాక్స్‌పై, కిటికీలు లేని స్టోర్‌రూములో నిద్రపోయేలా చేశాడు'' అని భార్య సుధామూర్తితో చెప్పిన విషయాన్ని చిత్ర ఆ పుస్తకంలో ప్రస్తావించారు.




# రాముని ప్రాణ ప్రతిష్ఠనాడే బిడ్డ పుట్టాలి

## ఆ రోజే ప్రసవం జరిగేలా చూడాలని వైద్యులకు గర్భిణుల అభ్యర్థన

లక్నో: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠనాడే బిడ్డకు జన్మనివ్వాలని గర్భిణులు పరితపిస్తున్నారు. తమ ఇంట్లో రాముడు జన్మించాలని కుటుంబ సభ్యులంతా కోరుకుంటున్నారు. ఇదే కోరికను వైద్యులకు చెప్పి, జనవరి 22నాడే ప్రసవించేలా చేయాలని కోరుతున్నారు. ఆ రోజు ప్రపంచమంతా గుర్తుండిపోయే మంచి రోజు కాబట్టి, తమ జీవితాల్లో కూడా మంచి జరుగుతుందని భావిస్తున్నారు. శ్రీరామునికి జన్మనిచ్చిన కౌసల్య మాదిరిగా తాము కూడా చరితార్థులం కావాలని గర్భిణులు కోరుకుంటున్నారు. దవాఖానల్లోని వైద్యులు కూడా వీరి కోరికను తీర్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే గర్భిణి ఆరోగ్య పరిస్థితి బాగుంటేనే ఆ రోజు ప్రసవం జరిగేలా చేస్తామని షరతు విధిస్తున్నామని వైద్యులు చెప్పారు. అంతే కాకుండా గర్భిణుల ఫిట్‌నెస్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు.

### 7000 కిలోల రామ్ హల్వా

బాల రాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగే ఈ నెల 22న భక్తులకు పంచేందుకు దేశానికి చెందిన ప్రముఖ చెఫ్ విష్ణు మనోహర్ 7,000 కిలోల ప్రత్యేక 'రామ్ హల్వా' తయారు చేయనున్నారు. ఈ ప్రత్యేక వంటకం కోసం అన్నీ సిద్ధం చేసుకుంటున్నారు. రామ్‌హల్వా తయారీ కోసం 12 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన కడాయిని కొనుగోలు చేశారు. 900 కిలోల రవ్వ, వెయ్యి కిలోల వెన్న, వెయ్యి కిలోల చక్కెర, 2000 లీటర్ల పాలు, 2500 లీటర్ల నీరు, 300 కిలోల డ్రైఫ్రూట్స్, 75 కిలోల యాలకుల పొడిని ఈ వంటకంలో వాడతారు. రామ్‌హల్వా తయారీ కోసం వాడే కడాయి బరువే 1300-1400 కిలోలు ఉంటుంది.




అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ గాలిపటాల పండగలో రెపరెపలాడుతున్న శ్రీరాముడి జెండా

### అత్తగారింటి నుంచి 3000 కానుకలు

నేపాల్‌లోని అత్తగారి ఇంటి నుంచి శ్రీరాముడికి 3000 కానుకలు అందాయి. నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ రామ్ జానకీ టెంపుల్ నుంచి సుమారు 500 మంది రామభక్తులు ఆదివారం అయోధ్యకు చేరుకున్నారు. వీరు సీతారాముల కోసం 3,000 విలువైన కానుకలను తీసుకొచ్చా రు. కానుకల్లో నగదు, దుస్తులు, పండ్లు, స్వీట్లు, బంగారు, వెండి ఆభరణాలతోపాటు ఇతర విలువైన వస్తువులు ఉన్నాయి.

### రామాయణ కాలం నాటి మొక్కలు

అయోధ్యలో రామాయణ కాలం నాటి మొక్కలు, అంతరించిపోయిన వృక్షజాతులను నాటాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఇందులో భాగంగా 50 వేల మొక్కలకు ఆర్డర్ ఇచ్చామని, త్వరలోనే అవి నగరానికి చేరుకుంటాయని అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ నర్సరీ డైరెక్టర్ రామ్ ప్రకాశ్ రాథోడ్ తెలిపారు. మరిన్ని రకాల మొక్కలను కూడా ఇక్కడకి తెప్పిస్తున్నామన్నారు.

# కర్ణాటక సర్కారులో ముసలం!

- జార్కిహోళి నివాసంలో దళిత నేతల సమావేశం
- మరిన్ని డిప్యూటీ సీఎం పదవులకు నేతల పట్టు
- డిప్యూటీ సీఎం డీకేకు చెక్ పెట్టేందుకు ఎత్తులు
- సీఎం పదవి కోసం డీకే ఇప్పటి నుంచే స్కెచ్
- లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయంపై కన్ను
- ఇదే అదనుగా బలోపేతం అవుతున్న బీజేపీ, జేడీఎస్



కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ , సీఎం సిద్ధరామయ్య, మంత్రి సతీశ్ జార్కిహోళి

బెంగళూరు, జనవరి 7: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతర్గత వర్గపోరు తారస్థాయికి చేరింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తమతమ వర్గాల ఆధిపత్యం కోసం తీవ్రస్థాయిలో పోటీ పడుతున్నారు. ఒకరి ఒకరు చెక్ పెట్టుకొనేందుకు ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నారు. డీకే శివకుమార్‌పై నమోదైన అవినీతి కేసుల్లో సీబీఐ విచారణకు అనుమతి నిరాకరిస్తూ ఇటీవల కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. ఈ సందర్భంగా ప్రభుత్వ పెద్దలకు విందు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి దళిత, వెనుకబడిన వర్గాల్లోని బలమైన నేతలైన మంత్రులు జీ పరమేశ్వర, సతీశ్ జార్కిహోళి, కేఎన్ రాజన్న, హెచ్‌సీ మహదేవప్ప, కేహెచ్ మునియప్ప తదితరులు హాజరయ్యారు. జార్కిహోళి నివాసంలో జరిగిన ఈ విందు అనంతరం పలువురు మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా కనీసం మూడు డిప్యూటీ సీఎం పదవులు ఏర్పాటుచేయాలని అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. మరిన్ని డిప్యూటీ సీఎం పోస్టులను సృష్టించటంలో తప్పులేదని సీఎం సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడు, దళిత నేత మహదేవప్ప తెలిపారు. సామాజిక వర్గం ప్రాతిపదికగా కాకుండా ప్రజల్లో బలం, పార్టీలో సీనియార్టీని బట్టి ఆ పదవులు ఇవ్వాలని సూచించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడను ఓడించిన ప్రస్తుత మంత్రి కేఎన్ రాజన్న కూడా భిన్న సామాజికవర్గాల నేతలకు డిప్యూటీ సీఎం పదవులు ఇవ్వాలని పార్టీ హైకమాండ్‌కు సూచించారు. కర్ణాటక పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆధిపత్యాన్ని దెబ్బకొట్టేందుకు సీఎం ప్రోద్బలంతోనే మంత్రులు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### డీకే కౌంటర్

సిద్ధరామయ్య వ్యూహానికి డీకే శివకుమార్ ప్రతివ్యూహం పన్నుతున్నట్టు సమాచారం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 15 ఎంపీ స్థానాలు గెలిపించటం ద్వారా.. సీఎం పదవికి మరింత దగ్గర కావాలని భావిస్తున్నట్టు తెలిసింది. తన ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తే సీఎం పదవి కోసం అధిష్ఠానంపై ఒత్తిడి పెంచవచ్చని ఆయన భావిస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అనుకూలంగా మార్చుకునేందుకు విపక్షం వ్యూహాలు

కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరును తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ చూస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ఈ రెండు పార్టీలు ఇప్పటికే నిర్ణయించాయి. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఓడించటమే తమ లక్ష్యమని మాజీ ప్రధాని దేవెగౌడ ఇటీవల ప్రకటించారు. బీజేపీతో సీట్ల సర్దుబాటు అంశం ప్రధానం కాదని, కాంగ్రెస్‌ను మట్టికరిపించటమే ముఖ్యమని పేర్కొన్నారు. దీంతో కర్ణాటక రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది.

# రాజాసింగ్ విద్వేష ప్రసంగం.. మహారాష్ట్రలో కేసు

ముంబై: విద్వేషపూరిత ప్రసంగాలు చేసినందుకు బీజేపీ ఎమ్మెల్యేలు టీ రాజా సింగ్, నితీశ్ రాణే తదితరులపై మహారాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. సోలాపూర్ సమీపంలోని రాజేంద్ర చౌక్ వద్ద శనివారం జరిగిన హిందూ జన ఆక్రోశ్ సభలో ఈ ఎమ్మెల్యేలిద్దరూ రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని పోలీసులు తెలిపారు. ఈ సభలో పాల్గొన్న సకల హిందూ సమాజ్ నేతలపై కూడా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రాణే ఈ సభలో మాట్లాడుతూ, జీహాదీలు, మసీదుల కూల్చివేత గురించి వ్యాఖ్యలు చేశారన్నారు. గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ, లవ్ జీహాద్ గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. వేర్వేరు మతాలకు చెందిన వారి మధ్య శత్రుత్వాన్ని సృష్టించేందుకు వీరు ప్రయత్నించారన్న ఆరోపణలపై కేసు నమోదైంది.

### ఈడీ అధికారులపై దాడి..

# టీఎంసీ నేతను అరెస్ట్ చేయండి

### పోలీసులకు బెంగాల్ గవర్నర్ ఆదేశం

కోల్‌కతా, జనవరి 7: ఈడీ అధికారులపై దాడికి పాల్పడిన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ అధికారులను ఆదేశించారు. షాజహాన్ సరిహద్దు దాటి ఉండవచ్చని, వెంటనే అరెస్ట్ చేసి ఉగ్రవాదులతో అతనికి ఉన్న సంబంధాలపై దర్యాప్తు చేయాలంటూ గవర్నర్ శనివారం రాత్రి పోలీస్ చీఫ్‌ను ఆదేశించినట్టు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. కాగా, షాజహాన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నట్టు గవర్నర్ చేసిన ఆరోపణలపై అధికార టీఎంసీ మండిపడింది. దీనిపై టీఎంసీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ మాట్లాడుతూ గవర్నర్ ఏ ఆధారాలతో ఈ ఆరోపణలు చేశారో అర్థం కావడం లేదని అన్నారు. షాజహాన్‌పై ఎలాంటి ఆధారాలు, నివేదిక లేకుండా ఆయన అలా ఎలా ఆరోపణలు చేస్తారు? అయనున్నది బెంగాల్‌లో సమాంతర ప్రభుత్వం నడపడానికి కాదని విమర్శించారు.

# ఐదుగురు ఎంపీలకు సంసద్ రత్న

న్యూఢిల్లీ, జనవరి 7: బీజేపీ ఎంపీ సుకాంత మజుందార్, శివసేన ఎంపీ శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే సహా ఐదుగురు లోక్‌సభ సభ్యులు ఈ ఏడాది సంసద్‌రత్న అవార్డులకు ఎంపికయ్యారు. మిగిలిన వారిలో బీజేపీ ఎంపీ సుధీర్ గుప్తా, ఎన్సీపీ ఎంపీ అమోల్ రాంసింగ్ కొల్హే, కాంగ్రెస్ ఎంపీ రాజ్ శర్మ ఉన్నట్టు అవార్డు నిర్వాహకులు ఆదివారం ప్రకటించారు. రాజధానిలో ఫిబ్రవరి 17న నిర్వహించే కార్యక్రమంలో వీరికి బహుమతులు అందజేస్తామని వారు చెప్పారు. జ్యూరీ కమిటీ మెంబర్స్ బృందం ఎంపీల సమగ్ర పనితీరును పరిశీలించి పార్లమెంట్‌లో ప్రతిభ కనబర్చిన సభ్యులను ప్రతి ఏడాది ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. అలాగే లోక్‌సభ కాలపరిమితి ఐదేండ్ల పాటు స్థిరమైన ప్రజ్ఞను ప్రదర్శించిన సభ్యునికి సంసద్ మహారత్న అవార్డు అందజేస్తారు. చెన్నైకు చెందిన లాభేతర సంస్థ ప్రైమ్ ఫౌండేషన్ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తితో 2010లో ఆయన చేతుల మీదుగానే ఈ అవార్డులను ప్రారంభించింది.

# 2025లో గగన్‌యాన్

న్యూఢిల్లీ :అంతరిక్ష పరిశోధనలో మరో ప్రతిష్టాత్మక మిషన్ 'గగన్‌యాన్'ను 2025లో చేపడుతున్నట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. తుది ప్రయోగానికి ముందు రోబో 'వ్యోమిత్ర'ను రోదసిలోకి పంపుతామన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, 'టెస్ట్ ఫ్లైట్స్‌ను ఈ ఏడాది ప్రయోగిస్తున్నాం. అలాగే వచ్చే ఏడాది.. ఓ భారతీయుడ్ని సముద్రగర్భంలో అత్యంత లోతైన చోటకు పంపిస్తున్నాం' అని అన్నారు. 'గగన్‌యాన్'లో ముగ్గురు వ్యోమగాముల్ని భూమి నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి పంపేందుకు ఇస్రో సిద్ధమవుతున్నది. మూడు రోజుల తర్వాత వారు తిరిగి భూమికి చేరుకుంటారు.

# సోషల్ మత్తులో యువత చిత్తు!

- సగటున 7 గంటలు సామాజిక మాధ్యమాల్లోనే
- అబ్బాయిలు 6 గంటల 45 నిమిషాలు
- అమ్మాయిలు 7 గంటల 5 నిమిషాలు
- సోషల్ మీడియాకు బానిసగా యువత.. ఐఐఎం-రోహ్‌తక్ సర్వే

న్యూఢిల్లీ, జనవరి 7: దేశంలోని యువత సామాజిక మాధ్యమాలకు బానిసగా మారుతున్నది. రోజులో సగటున 7 గంటలు సోషల్ మీడియాలోనే మునిగి తేలుతున్నది. ఐఐఎం-రోహ్‌తక్ నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అబ్బాయిల కంటే అమ్మాయిలే అధికంగా సోషల్ మీడియా వినియోగిస్తున్నారు. సగటున అబ్బాయిల స్క్రీన్ టైమ్ 6 గంటల 45 నిమిషాలు ఉండగా, అమ్మాయిల స్క్రీన్ టైమ్ 7 గంటల 5 నిమిషాలుగా ఉన్నది. 60.66 శాతం యువత సోషల్ మీడియా వేదికలను వాడుతున్నారు. సాయంత్రం వేళల్లోనే వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎంటర్‌టైన్‌మెంట్‌కు సంబంధించిన కంటెంట్‌నే 50 శాతం మందికిపైగా చూస్తున్నారు. గత దశాబ్ద కాలంలో స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం అసాధారణ రీతిలో పెరిగినట్టు ఐఐఎం పేర్కొన్నది. ఇంటర్నెట్ వసతులు మెరుగుపడటం, అందుబాటు ధరలో డాటా ప్లాన్స్ లభిస్తుండటం వల్ల పెద్ద సంఖ్యలో యువత డిజిటల్ మీడియావైపు మళ్లుతున్నట్టు వెల్లడించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్స్ ఫాలో అవ్వడం దగ్గర నుంచి యూట్యూబ్‌లో కంటెంట్ చూడటం వరకు.. సామాజిక మాధ్యమాలు యువత స్క్రీన్‌టైమ్‌ను అమాంతం పెంచినట్టు వివరించింది. గత ఏడాది అక్టోబర్-నవంబర్ మధ్య 18-25 ఏండ్ల వయసున్న 38,896 మందిపై అధ్యయనం నిర్వహించినట్టు పేర్కొన్నది. వీరిలో 18,521 మంది అబ్బాయిలు కాగా, 14,375 మంది అమ్మాయిలు ఉన్నట్టు తెలిపింది. వీరు ప్రధానంగా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, సఫారి, గూగుల్ క్రోమ్ వినియోగిస్తున్నట్టు తెలిపింది. అలాగే సంప్రదాయ ఫోన్ కాల్స్ కంటే ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ వాట్సాప్ కాలింగ్‌కే ప్రాధానమిస్తున్నదని, ప్రైవసీని కోరుకోవడమే ఇందుకు కారణమని వెల్లడించింది. డిజిటల్ అవకాశాలు, మానసిక ఆరోగ్యానికి సమప్రాధాన్యం ఇచ్చేలా జాగరూకతతో వ్యవహరించాలని ఐఐఎం సూచించింది.



సోషల్ మీడియాను వాడుతున్న వారు- 60.66 %

రోజులో సగటున సోషల్ మీడియా వినియోగం- 7 గంటలు


అబ్బాయిలు- 6 గంటల 45 నిమిషాలు

అమ్మాయిలు-7 గంటల 5 నిమిషాలు

### ఏ వేదికలో ఎంత సమయం?

| వేదిక | శాతం |
|---|---|
| ఇన్‌స్టాగ్రామ్ | 31.27% |
| వాట్సాప్ | 28.32% |
| స్నాప్‌చాట్ | 19.78% |
| ఫేస్‌బుక్ | 17.20% |

### కంటెంట్ వారీగా వ్యూయర్‌షిప్




### అధ్యయనం నిర్వహించిన సమయం- గత ఏడాది అక్టోబర్-నవంబర్ మధ్య

| ఎంతమందిపై | అబ్బాయిలు | అమ్మాయిలు |
|---|---|---|
| 38,896 | 18,521 | 14,375 |



# మెడికల్ పీజీ కౌన్సెలింగ్ ఆన్‌లైన్‌లోనే

- కాలేజీలు ఇకపై ప్రతి కోర్సు ఫీజునూ ముందుగానే ప్రకటించాలి
- సొంతంగా విద్యార్థులను చేర్చుకోకూడదు
- జాతీయ వైద్య కమిషన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 7: పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే చేపట్టాలని జాతీయ వైద్య కమిషన్ నిబంధనలను జారీ చేసింది. అలాగే కళాశాలలు ముందుగానే ప్రతి కోర్సు ఫీజును ప్రకటించాలని తెలిపింది. 2023లో రూపొందించిన కొత్త నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థలు మాత్రమే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ చేపట్టాలి. కళాశాలలు సొంతంగా విద్యార్థులను చేర్చుకోకూడదు. కేవలం ప్రతిభ ఆధారంగానే పీజీ ప్రవేశాలు జరగాలి. ఫీజు వివరాలు ప్రకటించని సీట్లను లెక్కించరు. యూనివర్సిటీ పరీక్ష విధానంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్, బహుళ ఐచ్ఛిక ప్రశ్నలను ప్రవేశపెట్టనున్నారు. విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ కోసం డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రామ్‌లోనూ మార్పులు చేశారు. ఇంతకు ముందు 100 పడకల దవాఖానను జిల్లా దవాఖానగా పేర్కొనేవారు. తాజాగా దీనిని 50 పడకలకు తగ్గించారు. ఒకసారి ఒక వైద్య కళాశాలకు పీజీ కోర్సులు, సీట్లు మంజూరు చేస్తే ఆనాటి నుంచి ఆ కోర్సులను గుర్తింపు పొందినవిగా భావిస్తారు. దీనివల్ల విద్యార్థులు పీజీ పూర్తయ్యాక తమ డిగ్రీలను నమోదు చేసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడవు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కాలేజీలు మూడో ఏడాది నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రారంభించవచ్చు. ప్రభుత్వ నిర్వహణలో ఇప్పటికే ఉన్న, ప్రతిపాదిత బోధనేతర దవాఖానలు అండర్ గ్రాడ్యుయేట్ కాలేజీలు లేకుండానే పీజీ కోర్సులు ప్రారంభించవచ్చు. పీజీ విద్యార్థులందరూ పరిశోధన, నైతిక విలువలు, గుండెపోటును నివారించే నైపుణ్యాల్లో శిక్షణ పొందాలి. ఈ నిబంధనలన్నీ సక్రమంగా అమలు చేసేందుకు జరిమానా విధింపు, సీట్లలో కోత, పూర్తిగా ప్రవేశాల నిలిపివేత వంటి చర్యలు చేపట్టనున్నారు.

# మందు మానేస్తే.. మంచిగ నిద్ర



న్యూఢిల్లీ, జనవరి 7: రాత్రివేళ ఓ రెండు పెగ్గులు (మద్యపానం) వేస్తేనే నిద్ర పడుతుందన్న దాంట్లో నిజం లేదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. అంతేకాదు.. రోజూ సాయంత్రం ఆల్కహాల్ తీసుకోవటం వల్ల సదరు వ్యక్తి గాఢ నిద్రకు దూరమవుతాడని, అతడిలో నిద్రపోయే విధానం దెబ్బతింటుందని అధ్యయనం పేర్కొన్నది. బ్రిటన్‌లో 4 వేల మందిపై పరిశోధకులు నెల రోజులపాటు ప్రయోగాలు జరపగా, అధ్యయన వివరాల్ని 'ద వాషింగ్టన్ పోస్ట్' తాజాగా వెల్లడించింది. ఆల్కహాల్ తీసుకోవటం ఆపేసిన తర్వాత గాఢంగా నిద్ర పోతున్నామని, ముందున్న సమస్యలు, ఆటంకాలు పోయాయని 56 శాతం మంది చెప్పారట. బ్రిటన్‌లో సీనియర్ సైంటిఫిక్ అడ్వయిజర్‌గా ఉన్న ఆరాన్ వైట్ మాట్లాడుతూ, 'ఆల్కహాల్‌ను వదిలేస్తే ఇంతకు ముందున్న గాఢ నిద్రను పొందొచ్చు. కొంతమంది ఉదయాన్నే నిద్రలేవటం మొదలవుతుంది' అని అన్నారు. అమెరికన్ అకాడమీ ఆఫ్ స్లీప్ మెడిసిన్ అధికార ప్రతినిధి, క్లినికల్ సైకాలజిస్ట్ జెన్నిఫర్ మార్టిన్ మాట్లాడుతూ, 'రాత్రి సమయంలో ఒక సగం గ్లాస్ వైన్ తీసుకుంటే.. నిద్రపై ప్రభావం చూపుతున్నది. కొన్నేండ్ల క్రితం ఆల్కహాల్ తీసుకోవటాన్ని ఆపేసి.. నన్ను నేను పరిశీలించుకున్నా. సాయంత్రం ఒక్క గ్లాస్ వైన్ ఆపేశా. రాత్రి నిద్ర ఎంతగానో మెరుగుపడింది' అని అన్నారు. క్రమంగా మద్యపానాన్ని విడిచిపెడితే మెరుగైన, మంచి నిద్రను పొందొచ్చునని పరిశోధకులు తెలిపారు.




### 140 భాషల్లో పాట..

# కేరళ యువతి గిన్నిస్ రికార్డ్

తిరువనంతపురం: కేరళ యువతి సుచేత సతీశ్ గొప్ప లక్ష్యం కోసం 140 భాషల్లో పాట పాడి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సృష్టించారు. ఒకే కాన్సర్ట్‌లో అత్యధికంగా 140 భాషల్లో పాడినందుకు ఆమెను ఈ రికార్డు వరించింది. వాతావరణం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సంగీత విభావరిలో ఆమె తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించి, అందరి మన్ననలను అందుకున్నారు. 2023 నవంబరు 24న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్‌లోని ఇండియన్ కాన్సులేట్ ఆడిటోరియంలో ఈ 'కాన్సర్ట్ ఫర్ క్లైమేట్' జరిగింది. తాను పాడిన పాటను ఆమె సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. వీటిని విన్నవారంతా మంత్రముగ్ధులై, ఆమెను అభినందిస్తున్నారు. 9 గంటల్లో 140 భాషల్లో పాట పాడి ఈ రికార్డును ఆమె సొంతం చేసుకున్నారు. భగవంతుని దయ వలన ఈ రికార్డును సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. దుబాయ్‌లో జరిగిన సీఓపీ 28 సదస్సులో 140 దేశాలు పాల్గొన్నాయి కాబట్టి, దానిని గుర్తు చేస్తూ 140 భాషల్లో పాడాలని అనుకున్నారు.

# మెలకువగా ఉండగానే చిన్నారికి బ్రెయిన్ సర్జరీ

## ఎయిమ్స్ వైద్యుల అరుదైన ఘనత

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రపంచంలోనే తొలిసారిగా అరుదైన సర్జరీ చేసి ఎయిమ్స్ వైద్యులు తమ ప్రతిభను చాటారు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఐదేండ్ల బాలికను స్పృహలో ఉంచి విజయవంతంగా శస్త్ర చికిత్స పూర్తి చేశారు. వివరాల్లోకి వెళితే.. ఒకటో తరగతి చదువుతున్న అక్షిత మూర్ఛతో బాధపడుతుండగా, ఆమెను పరీక్షించిన వైద్యులు మెదడు ఎడమ భాగంలో కణతులు ఉన్నట్టు గుర్తించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మెలకువగానే ఉంచి ఆమెకు ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఎయిమ్స్ న్యూరో సర్జరీ ప్రొఫెసర్ దీపక్ గుప్తా బృందం ఆమెను మెలకువగా ఉంచే సర్జరీ పూర్తి చేసింది. వైద్య పరిభాషలో 'అవేక్ క్రానియోటమీ'గా పిలిచే ఈ ఆపరేషన్ తర్వాత బాలిక ఆరోగ్యం నిలకడగా ఉంది. బాలికను స్పృహలో ఉంచే ఆపరేషన్ నిర్వహించినా ఆమెకు నొప్పి కనీస స్థాయిలో ఉండేలా వైద్యులు జాగ్రత్త పడ్డారు. కాగా మెలకువగా ఉండి ఆపరేషన్ చేయించుకున్న అతి చిన్న వయస్కురాలిగా అక్షిత రికార్డులకెక్కింది.



అక్షిత